
# మనిషి



దూర్జటి

"ఒక్కసారి అద్దాలు తుడవటం ఆపి పాపకి పాలు పడతావురా గోపీ!" లలితమ్మగారి కంఠం గోపాల్ చెవికి కంచు గంటలా వినిపించింది.

గోపాల్ పళ్ళు నూరుకుంటూ కోపాన్ని అణగదొక్కి "అలాగేనండి" అంటూ పాప దగ్గరకు నడిచాడు.

గోపాల్ వారాలు చేసుకొని చదువుకుంటున్నాడు. తల్లీ, తండ్రీ చనిపోగా ఒక్కడే మిగిలిపోయాడు ఈ ఏకైక సంతానాన్ని బంధువులు కొన్నాళ్ళు పోషించి "నేనెందుకు పోషించాలంటే, నేనెందుకు పోషించాలని" తగవులాడుకొని వదిలేసారు. పొట్ట గడవక కొన్నాళ్ళు బస్సుల్లోనూ, లారీల్లోనూ క్లీనర్‌గా పనిచేసాడు. కాని గోపాల్‌కి చదువంటే ఉన్న విపరీతమైన ఆసక్తి వల్ల ఆ పనుల్లో యిమడలేక ఎలాగైనా చదువు కొనసాగిద్దామని పట్టుదలగా ఇల్లిల్లు తిరిగి, అభిమానాన్ని చంపుకొని కొందరి ఇళ్ళలో వారాలకు కుదిరాడు. అలా వారాలు చేసుకుంటూ ఇంటర్‌లోకి వచ్చాడు.

"ఏమిట్రా ఆ పరధ్యానం? పాప గుక్కపెట్టి ఏడుస్తోంది. పని వాళ్ళంతా పనుల్లో వచ్చారు. వారానికో రోజు ఠంచనుగా తిండికొస్తావ్. కాస్త పని సాయం చెయ్యమంటే కదలవు. నేనలా గుడికెళ్ళొస్తా, పాపను ఆడిస్తూ ఉండూ." అంటూ లలితమ్మ పట్టుచీర గరగర లాడించుకుంటూ వెళ్ళిపోయింది.

గోపాల్‌కి మండిపోయింది. ఇంట్లో ఇద్దరు నౌకర్లున్నారు, తనకే పని చెప్పాలా? ఉట్టినే తిండిపెట్టడమే నన్న దుగ్ధ. లలితమ్మ భర్తకి ఏ మూలో కొంచెం జాలి ఉండటంవల్ల వారానికో రోజు తన తిండికి ఒప్పుకున్నాడుగాని, ఈ లలితమ్మ అయితే వీధిలోంచే బయటకు గెంటేది.

గోపాల్ భోజనం చేసే మరో ఇల్లు ఎకౌంటెంట్ రాఘవయ్యది. ఆయన గోపాల్‌కి ఆదివారం ఏర్పాటు చేసాడు. దానికి కారణం ఉంది. రాఘవయ్య ఆఫీసులో చేయగా మిగిలిన వర్క్ ఆదివారం ఇంటికి తెచ్చుకుంటాడు. గోపాల్‌కి ఆదివారం శెలవు. ఉదయాన్నే రప్పించి కొన్ని కూడికలు, తీసివేతల్లాంటి లెక్కలు అప్పగించి రాఘవయ్య భార్యతో సినిమాకో, షికారుకో వెళ్ళేవాడు. ఆ విధంగా తిండిపెట్టిన దానికి సరైన పని చేయించుకుంటాడు రాఘవయ్య.

గోపాల్ వారాలు చేసుకునే మరో ఇల్లు ఒక భూస్వామిది. ఆయనకు పల్లెలో చాలా మాగాణి భూములున్నాయి. కాని పట్నంమీద మోజుతో భూముల్ని కౌలుకిచ్చి పట్నంలో ఇల్లు కొనుక్కొని స్థిరపడ్డాడు. భూస్వామి భార్య పల్లెటూరి నుంచి రావటంవల్ల కాబోలు గోపాల్‌కి ఎంతో శ్రద్ధగా వడ్డించేది. అప్పుడప్పుడు పిండివంటలు కూడా వడ్డించేది. భూములవల్ల వాళ్ళకి బాగా ఆదాయం వచ్చేది. ఆవిడకు కంట కాసులపేరు, వడ్డాణం లాంటి పాత నగలు చాలా ఉన్నాయి. పండగల్లో అవి వేసుకొనేప్పుడు గోపాల్ చూసేవాడు. "ఇవన్నీ పేదవాళ్ళకు భూములు పంచకపోవటంవల్ల అనుభవిస్తున్న సంపదే కదా!" అని లోలోన అనుకొనేవాడు. తమ హక్కులను మరొకళ్ళు అనుభవిస్తున్నట్టు అనిపించేది గోపాల్‌కి.

గోపాల్ వారాలు చేసుకొనే మరో ఇల్లు తన క్లాస్‌మేట్ రమణది. రమణ తండ్రి ఏదో ఆఫీసులో ప్యూన్. బాగా చితికిపోయిన కుటుంబం. అయినా, రమణ తండ్రి గోపాల్‌కి తన ఇంట్లోనే బస ఏర్పాటు చేసాడు. గోపాల్, రమణలు క్లాస్‌మేట్స్ కాకుండా రూమ్‌మేట్స్ కూడా అయ్యారు. రమణ తండ్రికి గోపాల్‌లో నచ్చిన గుణం, వారాల ఇళ్ళల్లో పనులుచేసి అలసిపోయి వచ్చినా, అర్ధరాత్రి వరకూ శ్రద్ధగా కూర్చొని చదివేవాడు. అందుకే ఫస్టుమార్కులన్నీ గోపాల్‌వే. కాని, రమణ ఎక్కువ సినిమాలని, షికార్లని తిరిగేవాడు. ఫలితంగా పరీక్షల్లో తప్పి గోపాల్ కంటె వెనకబడిపోయాడు. రమణ తండ్రి గోపాల్ తెలివితేటలు, శ్రద్ధా చూసి ముచ్చటపడి అప్పుడప్పుడు బట్టలు కుట్టించేవాడు. రమణ సరిగ్గా చదువుకొనేలా చూడమని గోపాల్‌తో ఎప్పుడూ అనేవాడు. కాని గోపాల్ మాట రమణ వింటేగా!

మరో ఇల్లు ఒక పెద్ద ఆఫీసర్‌ది. ఆ ఇంట్లో అంతా నిశ్శబ్దంగా వుంటుంది. వంటవాడే గోపాల్‌కి వడ్డించేవాడు. కాని ఎప్పుడు వెళ్ళినా ఆ ఆఫీసర్‌గాని, భార్యగాని సరిగ్గా పలకరించేవారు కారు. గోపాల్ అహం దెబ్బతినేది. "డబ్బుందని వాళ్ళకెంత అహంకారం? పేదవాళ్ళతో మాట్లాడితే వాళ్ళ హోదా తగ్గిపోతుంది కాబోలు. ఈ అంతరాలు సమసిపోయే రోజు రావాలి." గోపాల్ ఆవేశపడేవాడు.

మరో ఇల్లు ఒక "బిగ్‌షాట్"ది. ఏదో ఫిలిమ్ డిస్ట్రిబ్యూషన్ కంపెని వుంది. మూడు కార్లు, రెండు బంగళాలు ఉన్నాయి. అతను నెలకు పది రోజులు మద్రాసులోనే ఉంటాడు గోపాల్‌కి "ఔట్‌హౌస్"లో వడ్డించేవారు. అది అవమానంగా అనిపించింది. వాళ్ళింటికి రోజూ పదిమందైనా అతిథులు వస్తూంటారు. అందరికి ఆ పెద్ద హాల్లో డైనింగ్ టేబుల్‌మీద వడ్డిస్తారు. తనకు ఒక్క రోజైనా పెట్టకూడదా? ఈ కార్లు, డబ్బు శాశ్వతమా? అసలు ఈ సంపదంతా

